జెండా పీకేస్తాం జాగ్రత్త

- నోటికొచ్చినట్టు ఆరోపణలు చేస్తే ఊరుకోం
- పవన్ వ్యాఖ్యలపై వలంటీర్ల ఆగ్రహ జ్వాల
- బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్

ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా ఉన్న వలంటీర్లపై జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ (పీకే) చేసిన అనుచిత వ్యాఖ్యలపై రెండో రోజూ నిరసన జ్వాలలు రగిలాయి. వలంటీర్లంతా రోడ్డెక్కి పవన్ కల్యాణ్‌కు వ్యతిరేకంగా ఆందోళన నిర్వహించారు. పవన్ దిష్టిబొమ్మలు దహనం చేశారు. వెంటనే బహిరంగంగా క్షమాపణ చెప్పకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పవన్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై వలంటీర్లు, వారి కుటుంబ సభ్యులు, ప్రజలు మండిపడుతున్నారు. విస్తృత సేవలందిస్తున్న వలంటీర్ల వ్యవస్థ వల్లే నేరాలు జరుగుతున్నట్టు పవన్ కల్యాణ్ విషపూరిత ప్రచారం చేయడంపై తగదని, మహిళలను కించపరిచిన పవన్‌కు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈమేరకు గాజువాక నియోజకవర్గ వ్యాప్తంగా మంగళవారం ఆందోళనలు మిన్నంటాయి. –గాజువాక/అగనంపూడి



79వ వార్డులో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ప్రశాంతి నగర్ వలంటీర్లు



నాతయ్యపాలెం జాతీయ రహదారిపై పవన్‌కు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న వార్డు వలంటీర్లు

పెదగంట్యాడ: నిస్వార్థంగా సేవలందిస్తున్న వలంటీర్లను సంఘ విద్రోహ శక్తులుగా జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ అభివర్ణించడం బాధాకరమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి గంగుళూరి రోజారాణి అన్నారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కోవిడ్ సమయంలో కూడా వలంటీర్ల ప్రాణాలను లెక్క చేయకుండా సేవలందించారని గుర్తు చేశారు. అటువంటి వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. వలంటీర్లను అవమానించిన పవన్ కల్యాణ్ బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. పిచ్చి పట్టి తిరుగుతున్న పవన్ కల్యాణ్‌ను పిచ్చాసుపత్రిలో చేర్పించాలన్నారు. అనంతరం పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, ఈగలపాటి యువశ్రీ, ఒమ్మి ఈశ్వరి, గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, ధర్మాల శ్రీను, సంపంగి ఈశ్వరరావు, ఎన్నేటి రమణ, పిట్టా రెడ్డి, కాకినాడ పెంటారావు, బొడ్డ గోవింద్, చిత్రాడ వెంకటరమణ, పాము రామశాస్త్రి, రామలక్ష్మీ, ఉమ, కనక లక్ష్మీ, విమలా థోమస్ తదితరులు పాల్గొన్నారు.



పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న రోజారాణి

ప్యాకేజీ స్టార్

అక్కిరెడ్డిపాలెం: పవన్ ప్యాకేజీ స్టార్ అని మరోసారి రుజువైందని జీవీఎంసీ 69వ వార్డు వలంటీర్లు ధ్వజమెత్తారు. వలంటీర్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా 69వ వార్డు వలంటీర్లు మంగళవారం సాయంత్రం నాతయ్యపాలెం జాతీయ్య రహదారిపై షీలానగర్ సిగ్నల్ పాయింట్ వరకు ర్యాలీ నిర్వహించారు. పలువురు వలంటీర్లు మాట్లాడుతూ కరోనా సమయంలో తోడు దొంగలైన చంద్రబాబు, పవన్‌లు ఎక్కడికి పారిపోయారని ప్రశ్నించారు. పవన్‌కు రాజకీయాలు చేతకాక పోతే పూర్తిగా సినిమాలు చేసుకోవాలని సూచించారు.



పవన్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్న వలంటీర్లు



కరోనా సమయంలో 66వ వార్డులో సర్వే చేస్తున్న వలంటీర్ (ఫైల్)

ఆస్పత్రికి వచ్చి మరీ పెన్షన్ ఇచ్చారు



గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నా. ప్రతి నెలా ప్రభుత్వం డయాలసిస్ పెన్షన్ ఇస్తోంది. ఒక్కసారిగా క్షీణించడంతో మెడికవర్ ఆస్పత్రిలో చేరా.. ఆ సమయంలో వలంటీర్ సీహెచ్ దేవి మానవత్వంతో ముందుకు వచ్చింది. స్వయంగా ఆస్పత్రికి వచ్చి పెన్షన్ అందసింది. గతంలో ఏ ప్రభుత్వంలో ఇలా జరగలేదు. లబ్ధిదారులను వెతుక్కొని వచ్చి మరీ ఇలా పెన్షన్ అందజేయడం ఎన్నడూ చూడలేదు. వలంటీర్ సేవలను ఎప్పటికీ గుర్తుంచుకుంటా..
–జుల్ఫాకర్ అలీ, లబ్ధిదారు. అశోక్‌నగర్, 65వ వార్డు,

పథకాల కోసమే డేటా సేకరణ



అర్హులకు సంక్షేమ పథకాలను అందించడం కోసమే తాము డేటా తీసుకుంటాం. ఆ డేటా మావద్దే ఉంటుంది. మా అడ్మిన్‌కు కూడా ఇవ్వం. తమకు పథకం కావాలని దరఖాస్తు చేసుకున్నవారినుంచే డేటాను తీసుకొని అప్‌లోడ్ చేస్తాం. దీనిపై పవన్ కల్యాణ్ తమను నిందించడం తగదు.
– మహ్మద్ హస్సన్, వలంటీర్, గాజువాక

క్షమాపణ చెప్పాలి



తాము నేరాలు చేస్తున్నట్టు పవన్ కల్యాణ్ చిత్రీకరించడం దుర్మార్గం. మహిళలను అవమానించడం ఆయనకు తగదు. ఈ విషయంలో ఆయన భేషరతుగా క్షమాపణ చెప్పాలి. లేనిపక్షంలో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది.
– వి.నవ్య, వలంటీర్, బీసీ రోడ్

ఒకటో తేదీ ఉదయమే పెన్షన్



ప్రతినెలా ఒకటో తేదీ ఉదయాన్నే వలంటీర్ మా ఇంటికి వచ్చి పింఛన్ ఇస్తున్నారు. ఇది వరకు దూరంగా ఉన్న స్టేజీ వద్దకు వెళ్లి గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. ఇప్పుడు ఇంటికే తెచ్చి పింఛన్ ఇవ్వడం నాకు ఎంతో సంతోషంగా ఉంది.అలాంటి వలంటీర్లను కించపరడం తగదు.
– కె.శేషు, లబ్ధిదారి, చినగంట్యాడ

వైఎస్సార్‌సీపీ నేతలకు సంబంధం లేదు



వలంటీర్లు వైఎస్సార్ సీపీ నాయకులకు లోబడి పని చేస్తున్నారని పవన్ అనడం భావ్యం కాదు. వలంటీర్లలో అన్ని పార్టీల అభిమానులు ఉన్నారు. మేమంతా ప్రభుత్వానికి వారధులం ..ప్రభుత్వ పథకాలు అమలు చేయడమే మా బాధ్యత. పవన్ కల్యాణ్ తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలి. – ఎల్.పద్మ, వలంటీర్, బీసీ రోడ్

క్లుప్తంగా

భవిత కేంద్రానికి బీరువా వితరణ



భవిత కేంద్రానికి బీరువా అందజేస్తున్న పావనిని అభినందిస్తున్న ఎంఈవో రమణాజీ

పెదగంట్యాడ: భవిత కేంద్రంలోని చిన్నారుల కోసం తమ వంతు సాయం చేయాలని మండల విద్యాశాఖాధికారి రమణాజీ అన్నారు. మండలంలోని సిద్ధేశ్వరానికి చెందిన పావని అనే మహిళ భవిత కేంద్రానికి బీరువా అందజేశారు. ఈ సందర్భంగా ఆమెను ఎంఈవో రమణాజీ అభినందించారు. ఈ కార్యక్రమంలో సూర్యనారాయణ, బి.విజయభారతి పాల్గొన్నారు.

రెండు లారీల ఢీ



ఆటోనగర్ సిగ్నల్ పాయింట్‌లో ఢీకొన్న లారీలు

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్ద సోమవారం అర్ధరాత్రి రెండు లారీలు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. భెల్ సిగ్నల్ పాయింట్ నుంచి ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్ద ఆటోనగర్‌లో మలుపు తిరుగుతున్న లారీను గాజువాక నుంచి షీలానగర్ వైపు వస్తున్న లారీ ఢీ కొట్టింది. ప్రమాదంలో లారీల ముందు భాగం నుజ్జునుజ్జయ్యాయి. లారీల్లో ఉన్న డ్రైవర్లకు ఎటువంటి గాయాలు కాలేదు.

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న దేవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి, సిబ్బంది

పెదగంట్యాడ: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని దేవాడ పీహెచ్‌సీ వద్ద మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రదీప్‌రాజా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జనాభా నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించారు. కుటుంబ నియంత్రణ పద్ధతులను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, సీహెచ్ అన్నపూర్ణ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

రైఫిల్ షూటింగ్‌లో మణికంఠ ప్రతిభ



అక్కిరెడ్డిపాలెం: హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్‌లో మణికంఠ రెడ్డి ప్రతిభ కనబరిచాడు. హైదరాబాద్‌లో గత నెల 23 నుంచి వారం రోజుల పాటు యూత్, జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో 9 ఈవెంట్లలో పోటీలను నిర్వహించారు. మణికంఠ రెడ్డి తొమ్మిది విభాగాల్లో పోటీ పడ్డాడు. ఆరు విభాగాల్లో స్వర్ణ పతకాలు, ఒక విభాగంలో రజత పతకం సాధించాడు. ఈ నెల 7న విజేతలను రాప్ ప్రకటించింది. సోమవారం విజేతలకు హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో రాప్ అధ్యక్షుడు తొట్టెంపూడి సలాలిత్ చేతుల మీదుగా పతకాలను అందుకున్నాడు. మంగళవారం విశాఖకు చేరుకున్న మణికంఠ రెడ్డిని తండ్రి చందు రెడ్డి, తల్లి అన్నపూర్ణ, స్నేహితులు అభినందించారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'పై అవగాహన



జగనన్న సురక్షపై అవగాహన కల్పిస్తున్న ధర్మాల శ్రీను

పెదగంట్యాడ: ప్రజలకు సత్వర సేవలందిచేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని వైఎస్సార్ సీపీ 64వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను అన్నారు. జీవీఎంసీ 64వ వార్డు పరిధిలోని యారాడ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల్లో 11 సేవలను ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు. కుల, ఆదాయ, జనన, మరణ, ఫ్యామిలీ మెంబర్, మ్యారేజ్ సర్టిఫికెట్, ఆధార్ కార్డులు, రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులను ఉచితంగా చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విస్తృతంగా ప్రచారం చేయాలని వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, ఎంఎల్‌వో తేజ, తొత్తర లక్ష్మి, వెంకట అప్పారావు, బంక రాము, సూర్యనారాయణ, వలంటీర్లు పాల్గొన్నారు.

విస్తృత ప్రచారం చేయాలి

అగనంపూడి: జగనన్న సురక్షతో ప్రజలకు అందే సేవలను విస్తృతంగా ప్రచారం చేయాలని జేసీఎస్ కన్వీనర్లు ఇల్లపు ప్రసాద్, వాడపల్లి రామచంద్రరాజు అన్నారు. 85వ వార్డు పరిధిలోని కొండయ్యవలస, పెదమడక, బీసీకాలనీ, పినమడక, ఫార్మాసిటీ కాలనీ వార్డు సచివాలయాల్లోని గృహసారథులు, వలంటీర్లు, కన్వీనర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గున్నంటి పూర్ణానందశర్మ (పూర్ణ), ఎంఎల్‌వోలు హేమంత్‌రెడ్డి, వెంకటేష్, చంద్రమౌళి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

నేడు 87వ వార్డులో జగనన్న సురక్ష కార్యక్రమం

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధి తెలకులవీధి గ్రౌండ్‌లో గాజువాక నియోజకవర్గ స్థాయి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు వార్డు వైస్సార్‌సీపీ ఇంచార్జ్ కోమటి శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. జీవీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి కణితి, వడ్లపూడి సచివాలయ పరిధిలోని అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందనివారికి, వివిధ కారణాల వల్ల సర్టిఫికెట్లు అందని వారికి గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి చేతులమీదుగా ఉచితంగా సర్టిఫికెట్లను అందించనున్నారు.

స్టీల్‌ప్లాంట్ పోలీసులకు బ్రహ్మకుమారీల సత్కారం



స్టీల్‌ప్లాంట్ సీఐ, ఎస్‌ఐలు, సిబ్బందిని సత్కరిస్తున్న బ్రహ్మకుమారీలు

ఉక్కునగరం: ఓం శాంతి బ్రహ్మకుమారీలు మంగళవారం స్టీల్‌ప్లాంట్ పోలీసులను సత్కరించారు. కోవిడ్ సమయంలో పోలీసులు చేసిన సేవలను గుర్తించి వారిని సత్కరించాలని బ్రహ్మకుమారీ ముఖ్య కేంద్రం మౌంట్ ఆబూ నుంచి వచ్చిన సూచనల మేరకు పెదగంట్యాడ వినాయక నగర్ వుడా కాలనీకు చెందిన బ్రహ్మకుమారీ కేంద్ర ఇన్‌చార్జ్ శాంతి నేతృత్వంలో సత్కరించారు. సీఐ వి. శ్రీనివాసరావు, ఎస్‌ఐలు వరలక్ష్మి, శ్రీకాంత్, సిబ్బందికు మౌంట్ అబూ నుంచి వచ్చిన శాలువాలు, ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో సీఐ వి. శ్రీనివాసరావు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

అగనంపూడి సమస్యలపై ఎంపీకి వినతి



ఎంపీ ఎంవీవీ సత్యనారాణకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అగనంపూడి: నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న టోల్‌గేటు తరలించాలని, 85, 88 వార్డులకు అనుసంధానంగా ఉన్న తలారివానిపాలెం అండర్ పాత్ వంతెనను విస్తరించాలని అగనంపూడికి చెందిన నాయకులు ఎంపీ ఎంవీవీ సత్యానారాయణకు వినతి పత్రం అందజేశారు. రైతు బజార్ ఏర్పాటు చేయాలని, హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రిలో స్థానికులకు ఉపాధి కల్పించాలని వినతిపత్రంలో కోరా రు. ఎంపీని కలిసిన వారిలో నాయకులు బి.సత్యనారాయణ, ఎం.వి.రమణ, టి.రాము, ఎం.శ్రీను ఉన్నారు.

గంగవరం పోర్టు కార్మికుల భిక్షాటన



పెదగంట్యాడ జంక్షన్‌లో భిక్షాటన చేస్తున్న గంగవరం పోర్టు కార్మికులు

పెదగంట్యాడ: గంగవరం పోర్టు నిర్మాణం జరిగితే గంగవరం, దిబ్బపాలెంలోని మత్స్యకారుల బతుకుల్లో వెలుగులు వస్తాయని అనుకున్నామని, కానీ అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం కార్మికులను ఇలా బిచ్చగాళ్లను చేస్తుందని అనుకోలేదని గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు అన్నారు. జీతాలు పెంచాలని కోరుతూ గంగవరం పోర్టు కార్మికులు చేపట్టిన నిరవధిన నిరసన దీక్షలు మంగళవారం 8వ రోజుకు చేరుకున్నాయి. ఈ ఆందోళన కార్యక్రమంలో భాగంగా కార్మికులంతా కలిసి పాత గాజువాక జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. పోర్టు యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం పాత గాజువాక జంక్షన్ నుంచి పెదగంట్యాడ వరకూ భిక్షాటన చేశారు.

విశాఖ ఉక్కును కాపాడుకుంటాం



దీక్షా శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మికులు పట్టువదలక ఉక్కు పరిశ్రమ కోసం నిద్రాహారాలు మాని పోరాటం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ప్రశ్నించారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే దీక్షలు మంగళవారం నాటికి 880వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలువురు కార్మికుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని డిమాండ్ చేశారు. ఉక్కు పోరాటం మొదలుపెట్టి 880 రోజులు గడుస్తున్న కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును ఇంత చిన్నచూపు చూడడం సరికాదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని, పార్లమెంట్‌లో ఉపసంహరణ బిల్లును ప్రవేశ పెట్టాలని, లేకపోతే పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మహిళా సాధికారతకు మోదీ కృషి



మహిళలకు కరపత్రాలను అందజేస్తున్న కరణంరెడ్డి

గాజువాక: ప్రధానమంత్రి మోదీ తన తొమ్మిదేళ్ల పాలనలో మహిళా సాధికారత కోసం ఎంతగానో కృషి చేశారని బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు తెలిపారు. సంపర్క్ సే సమర్థన్ కార్యక్రమంలో భాగంగా పాతకర్ణవానిపాలెంలోని జాగృతి పొదుపు సంఘం సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా సాధికారత కోసం బ్యాంకుల్లో జన్ ధన్ ఖాతాలను తెరిపించారని, కరోనా సమయంలో ప్రతి ఒక్కరికీ రూ.1500 నగదును జమ చేశారని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాలద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నారన్నారు. ప్రతి ఇంటికీ మంచినీటి సదుపాయం, వంటగ్యాస్ సదుపాయం కల్పిస్తున్నారన్నారు. మోదీ తొమ్మిదేళ్ల పాలనపై రూపొందించిన కరపత్రాలను ఈ సందర్భంగా వారికి అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కరణం భారతి, సిరసపల్లి అచ్చియమ్మ, రామస్వామి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీపై కార్మికులకు అపార విశ్వాసం



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి రాజు

ఉక్కునగరం: కార్మికులకు ఐఎన్‌టీయూసీపై అపార విశ్వాసం ఉందని, ఇందుకు నిదర్శనం షిప్‌యార్డ్ కోపరేటివ్ ఎన్నికల్లో తొమ్మిది స్థానాలు ఐఎన్‌టీయూసీ గెలుచుకోవడమేనని స్టీల్ ఐఎన్‌టీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి బీ.ఎస్. రాజు అన్నారు. మంగళవారం సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద జరిగిన ఆయన ఐఎన్‌టీయూసీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని సంస్థల్లోని కార్మికుల ప్రయోజనాల కోసం తాము పనిచేస్తున్నామన్నారు. షిప్‌యార్డ్, స్టీల్‌ప్లాంట్‌లలో కార్మికులకు ఆర్థిక ప్రయోజనాలు సాధనకు ఎనలేని కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కారు రమణ, అవతారం, ప్రభాకరరెడ్డి, ఎస్.ఎ. నాయుడు, డి. మోహన్, మొల్లి ఈశ్వరరావు, గంగవరం గోపి పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న బీజేపీ



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు

ఉక్కునగరం: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించడానికి పటిష్టమైన కార్మికోద్యమ నిర్మాణం కీలకమని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఓబులేసు అన్నారు. ఆంధ్ర కేసరి కళాక్షేత్రంలో రెండు రోజుల యువ కార్యకర్తల శిక్షణా తరగతులు మంగళవారం ముగిశాయి. ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ దేశంలోని కార్మికవర్గం తీవ్రమైన గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటుందన్నారు. పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను మోదీ ప్రభుత్వం హరిస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో మోదీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపకపోతే దేశంలో ప్రజలకు కనీస ప్రజాస్వామిక హక్కులు కూడా ఉండే పరిస్థితి లేదన్నారు. ఆగస్టు 9వ రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలను విజయవంతం చేయాలని కోరారు. ప్రొఫెసర్ అంజయ్య, ప్రొఫెసర్ బి. జమిందార్, ఎం. వెంకటయ్య, రాష్ట్ర ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శి ఎస్. వెంకటసుబ్బయ్య తదితరులు ప్రసంగించారు.

23న ప్రజా సింహగర్జన



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రామచంద్రయాదవ్ తదితరులు

దాబాగార్డెన్స్ : బీసీలకు రాజ్యాధికారం వచ్చేలా త్వరలో నూతన పార్టీ ఆవిర్భావం జరుగుతుందని బీసీ జాతీయ నేత బోడే రామచంద్రయాదవ్ పేర్కొన్నారు. నగరంలోని ఓ హోటల్లో మంగళవారం అనకాపల్లి జిల్లా భారతీయ యాదవ మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ మొల్లి సన్నిబాబు నిర్వహించిన నూతన పార్టీ ఆవిర్భావ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 23న దళిత, బహుజన, రైతు, గ్రామిక, మైనార్టీ, వెనుకబడిన కులాల రాజ్యాధికారం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రజా సింహగర్జన నిర్వహించనున్నట్లు చెప్పారు. గుంటూరు..విజయవాడ జాతీయ రహదారి నాగార్జున విశ్వ విద్యాలయం ఎదురుగా నిర్వహించనున్న ప్రజా చైతన్య వేదికకు పెద్ద ఎత్తున ఆయా వర్గాల ప్రజలు హాజరవుతున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఐక్యంగా ఉంటూ రాజ్యాధికారం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నమ్మి అప్పలరాజు, బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కిలాడి అప్పలరాజు తదితర బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల నాటికి సమస్యలన్నీ పరిష్కారం



ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అగనంపూడి: వచ్చే ఎన్నికల నాటికి నియోజకవర్గంలో సమస్యలు లేకుండా చేయడమే ధ్యేయంగా గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నామని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 85వ వార్డు ఫార్మాసిటీ నిర్వాసితకాలనీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లలో సంక్షేమంతోపాటు అభివృద్ధి పెద్దపీట వేయడం జరిగిందన్నారు. గాజువాక నియోజకవర్గంలోనే ఏళ్లనుంచి పరిష్కారం కాని సమస్యలు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చొరవతో పరిష్కారమయ్యాయన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మరిన్ని సేవలు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, జేసీఎస్–2 కన్వీనర్ ఇల్లపు ప్రసాద్, బోర సోమునాయుడు, యలమంచిలి అప్పారావు, అప్పలరాజు, వాసు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాచపోలమాంబ పండగ

దాబాగార్డెన్స్ : భక్తుల కొంగుబంగారం, అల్లిపురం వాసుల ఆరాధ్య దైవం శ్రీ రాచపోలమాంబ అమ్మవారి పండగ మంగళవారం వైభవంగా చేపట్టారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. గోకుల్ థియేటర్ దరి అమ్మవారి ప్రధాన దేవాలయంతో పాటు, మెయిన్‌రోడ్డు సదనం పట్టు వద్ద గల ఉపాలయంలో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు.